
ప్రజాశక్తి
మంగళవారం 15 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం





అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్రకార్యదర్శి సుబ్బ రావమ్మ, నాయకులు

మార్గనిర్దేశకుడు అంబేద్కర్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశాన్ని ఏకతాటిపై నడిపించేందుకు మార్గ నిర్దేశం చేసిన నాయకుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జరిగింది. ముందుగా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ తాత్విక చింతన దేశాన్ని నడిపిస్తుందన్నారు. ఇందులో ముఖ్యంగా విద్య అనే ఆయుధం ఉపయోగపడిందని అన్నారు. ఏప్రిల్‌లో ముగ్గురు మహనీయుల జయంతి జరుపుకున్నామని, వీరు సమాజానికి ఒక గొప్ప దిశానిర్దేశం చేసిన మహానుభావులను అన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి జనాభా ఎక్కువ ఉందని అంబేద్కర్ స్ఫూర్తితో మంచి విజయాలు దిశగా అడుగులు వేయాలని అన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సాంఘీక సంక్షేమ వసతి గహాల విద్యార్థులు 71 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారన్నారు. పదవ తరగతిలో కూడా మంచి ఫలితాలు సాధిస్తామని అశాభావం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలను రూ.2కోట్లుతో మరమ్మతులు, అదనపు వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రూ.11.53 కోట్లతో ఎస్‌సి లబ్ధిదారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అంబేద్కర్ జయంతి రోజు నుండే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన చెప్పారు. డిఆర్‌ఒ కె.హేమలత మాట్లాడుతూ గొప్ప ఆదర్శనీయులని, ఆయన స్ఫూర్తితో అంతర్జాతీయంగా పేరు సాధించే దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం పార్వతీపురం సాంఘిక సంక్షేమ వసతి గృహం -1కు చెందిన గాయత్రి కళాశాల డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థి పి రిమా, బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సుస్మిత అంబేద్కర్ గొప్పదనంపై ప్రసంగించారు. గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికను అందరూ పఠించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సీతానగరం మండలం పెదబొండపల్లికి చెందిన మూకళ్ళ నిఖిల్‌కు రూ.39 వేల విలువ చేసే లాప్ టాప్‌ను, పాలకొండ మండలం తుమరాడకు చెందిన బొంతు శిరీషకు రూ.13 వేలు విలువ చేసే టచ్ ఫోన్‌ను అందజేశారు. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రాయితీపై రూ.4.52 లక్షల విలువ గల 15 వ్యవసాయ పవర్ వీడర్లను 15 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఐదుగురు మహిళా లబ్ధిదారులకు 30 రకాల (పి యం డి ఎస్) విత్తనాల కిట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో 12,785 మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్ కింద రూ.74.26 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులను అందజేశారు. చవితి మీనాక్షికి మంజూరు చేసిన రూ.50 వేల విలువగల గొర్రెల యూనిట్, ఏనుగుల వనితకు పిఎం ఏజెవై పథకం కింద రూ.2 లక్షల విలువ గల ఫోటో స్టూడియో యూనిట్ మంజూరు ఉత్తర్వులు కలెక్టర్ అందజేశారు. వసతి గహాలకు పరుపులను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం డి గయాజుద్దీన్, వెలుగు ఎపిడి వై సత్యం నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు, జూనియర్ కళాశాల ఉపన్యాసకులు ఎ.రాజు, జిల్లా బిసి సంక్షేమ అధికారి అప్పన్న, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు గొడబ ప్రభాకర రావు, కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఐటిడిఎలో...

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, పిఎఒ శ్రీనివాస్, డ్వామా ఎపిడి సురేష్ నాయుడు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఘనంగా నివాళి

ప్రజాశక్తి - పాలకొండ

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరాయమ్మ పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక శ్రీరామ డిగ్రీ కాలేజీ ఆవరణలో సోమవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలపూల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా ప్రస్తుత పాలకులు విధానాలను రూపొందిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా భావ ప్రకటన, మత స్వేచ్ఛను హరించే విధానాలు రూపొందించడం దుర్మార్గమైన చర్యలని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన వారే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మతోన్మాద చర్యలకు పాల్పడడం దుర్మార్గమని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కుతుందన్నారు. కార్మిక చట్టాలను మార్చివేసి ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి నిరుద్యోగాన్ని పెంచుతుందని తెలిపారు. మోడీ పాలనతో రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందన్నారు. రాజ్యాంగం ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడి, పరిరక్షణకు ప్రజలంతా ఉద్యమించాలని, అదే అంబేద్కర్‌కు అర్పించిన ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, నాయకులు బి.అమరవేణి, దూసి దుర్గారావు, ఎ.లక్ష్మణరావు, ఎ.భానుచందర్, ప్రజాసంఘాల నాయకులు కె.పార్వతి, ఎన్.ఈశ్వరమ్మ, బి.అరుణ, ఎన్.దరిశమ్మ, జి.శారద తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఇందిరా కాలనీ వరకు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మెయిన్ రోడ్డుపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కై ఉద్యమిద్దామని, రాజ్యాంగ విలువలను కాపాడదామని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మామిడి శివ, గంగ్రెటి గంగరాజు, బంగారి రాజేష్, పడాల ఇప్పలమ్మ, బంగారు లీల తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : సిఐటియు నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ నాయకులు రాముడు, శంకర్రావు, శ్రీను రవి లక్ష్మి పోలరాజు, కార్మికులు పాల్గొన్నారు.

కొమరాడ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆటో యూనియన్ నాయకులు బి.గోపి, భవన కార్మిక సంఘం నాయకులు మన్మధరావు, ఎస్ గిరిజన సంఘం నాయకులు రమేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, భవన కార్మికులు, గిరిజన యువకులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలో బలిజిపేట, గుడివాడ కాలనీలో అంబేద్కర్ విగ్రహాలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు పూలదండ వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు చంటి, ఆదినారాయణ, సుధామ తౌడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: కెవిపిఎస్ నాయకులు జి ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాచిపెంటలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోనిబొడ్లగూడలో అంబేద్కర్ జయంతి సభ సందర్భంగా మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, మండల నాయకులు మండంగి శ్రీను మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ద్వారానే ఎస్‌సి, ఎస్‌టి, బిసిల హక్కులు ముందుకు వెళతాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండంగి శ్రీహరి, కిల్లక రాంప్రసాద్, కోలక దినేష్, కోలక గిరి, మండంగి విజయ, మండంగి చార్మి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఇందిర

అందరివాడు అంబేద్కర్

వీరఘట్టం : అందరి కోసం అందరివాడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ వి.ఇందిరా, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ సింహాచలం, వావిలపల్లి సన్యాసినాయుడు, హరిబాబు, ఆలుబిల్లి కుమారస్వామి, పర్రి అనిల్, రామ్మూర్తి హితవు పలికారు. మండలంలోని దశమంతపురంలో అంబేద్కర్ సేవా సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో వారు పాల్గొని మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు గురికాకుండా ఉన్నత శిఖరాలు అవలంభించేందుకు కష్టపడి చదివి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ అంబేద్కర్ సేవా సంఘం కెవిపిఎస్ అనుబంధం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు, అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.







పార్వతీపురం, బలిజిపేట, గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం : టవర్లు నిర్మించి మధ్యలో నిలిపివేయడం అన్యాయమని సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి అన్నారు. మండలంలోని గొయిపాక పంచాయతీ కుంతేసులో శాఖ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ గొయిపాక పంచాయతీ కుంతేసులో బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ నిర్మాణ పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడిచినా నేటికీ పూర్తి చేయకపోవడం అన్యాయమ న్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ పక్కనే ఉన్నప్పటికీ కనీసం సిగ్నల్ అందడంలేదని, జియో నెట్వర్క్ కంటికి కానరాని దూరంలో ఉన్నప్పటికీ పుష్కలంగా సిగ్నల్ అందుతుందని దీనికి కారణం నేటి ప్రభుత్వ కార్పొరేట్ విధానాలే నిదర్శనమని అన్నారు. నెట్వర్క్ లను అందుబాటులోకి తీసుకొస్తామన్న అధికార ప్రకటనలు, ఆచరణలో శూన్యమని మండిపడ్డారు. బిఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ అందకపోవడంతో కార్పొరేట్ నెట్వర్క్ రీఛార్జ్‌లు విపరీతంగా పెంచడంతో పూర్తిగా నెట్వర్క్ వినియోగం లేకుండా పోతుందని వివరించారు. కావున, వెంటనే మధ్యలో నిలిపివేసిన బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ పనులను పూర్తి చేసి, నెట్వర్క్ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్, గొయిపాక శాఖ సభ్యులు ఎం. తిరుపతిరావు, వెంకటరావు, ఎం.రెడ్డిరావు, శంభు, తిరుపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విఆర్‌ఎల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనాలు చెల్లించాలని, తెలంగాణ మాదిరిగా పే స్కేలు నిర్ణయించాలని విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వై.మన్మధరావు, జిల్లా కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం జి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని కోరారు. విఆర్‌ఎల సమస్యలపై ప్రజాప్రతినిధులకు రాయబారాలు నడపాలని, మే ఒకటిన మండల కేంద్రాల్లో మేడే జరపాలని, 27, 28, సామూహిక దీక్షలు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మధ్య చనిపోయిన విఆర్‌ఎ కమిటీ స్థానాల్లో కొత్తగా రాయిపల్లి సూర్యనారాయణ, బిబి తిరుపతిరావులను కమిటీలోకి తీసుకున్నామని చెప్పారు. సమావేశం అనంతరం అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్ సూర్యనారాయణ, బి తిరుపతిరావు, జి సాంబ, పవన్, కొండలరావు, బి రామారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రంగంపేట, కాజీపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను నిర్ణీత సమయాల్లో చేపట్టాలని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఫారం పాండ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంతోష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు తిరుపతిరావుతోపాటు వేతనదారులు పాల్గొన్నారు.



మేం వితంతువులం కాదా బాబూ?

- దరఖాస్తులు చేసినా ఫలితం లేని వైనం..
- పింఛను రాక వితంతువులు దిగులు

ప్రజాశక్తి - మక్కువ

జీవితకాలం తోడునీడుగా బతకాల్సిన వారు అర్ధాంతరంగా ఆయుష్షు తీరిపోయి తను చాలించడంతో ఒంటరిగా జీవితం నెట్టుకు రావాల్సి పరిస్థితి వారిది. ఆర్థికస్థోమత లేక ప్రభుత్వం పింఛను రూపంలో చేయూత అందిస్తోందని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే మిగులుతుంది. సమాజంలో అనేక అవమానాలను భరిస్తూ మేమేం చేశాం పాపం... మాకెందుకు ఈ శాపం అంటూ రోధిస్తున్న వితంతువులు ఎందరో. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ గత ప్రభుత్వం నుంచి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఏళ్ల తరబడి వితంతు పెన్షన్ కోసం ఎదురుచూసిన వారి కంటే కొద్దికాలంలో వితంతువులుగా మారిన మహిళలకు పెన్షన్ వస్తూ తమకు రాకపోవడంతో మేము వితంతువులం కాదా బాబు అంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా తీరును చూసిన వారికి కంటతడి తెప్పించక మానదు.

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వల్ల ఏళ్ల తరబడి వితంతువులుగా మారిన వారికి అవస్థలు తప్పడం లేదు. కొంతకాలంగా ప్రారంభానికి నోచుకోని పింఛన్ల నమోదు ప్రక్రియ కార్యక్రమం గతేడాది నవంబర్ నుంచి పనిచేస్తుంది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో వితంతువులందర్లో ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. కానీ ఇంతలోనే గతేడాది వితంతువులుగా మారిన వారిని వెబెసైట్ తీసుకోకపోవడంతో వారిలో కలవరం మొదలైంది. 2024 నవంబర్ నుంచి వితంతువులుగా మారిన వారికి మాత్రమే వెబ్సైట్లో దరఖాస్తు చేసుకునే ఆస్కారం కల్పిస్తుంది. దీంతో మండలంలోని 21 పంచాయతీల్లో ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ ఉన్న వితంతువులు ఆయా కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వ వెబ్సైట్‌లో ఉన్న కాస్త లోపాన్ని సవరణ చేస్తే తప్ప ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వితంతువులకు పెన్షన్ వచ్చే ఆస్కారం లేదు. ఇప్పటికే ఈ పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎన్నికల నిబంధనలు అడ్డు రావడంతో అలాగే ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం వితంతు పెన్షన్లకు అవకాశం కల్పించినప్పటికీ పాత వారికి చోటు దక్కడం లేదు. దీంతో వేలాదిమంది వితంతువులు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏళ్ల తరబడి పెన్షన్ కోసం నిరీక్షిస్తున్న వితంతువులకు పెన్షన్ అందేలా చూడాలని వారంతా రోధిస్తున్నారు. అందరికీ పెన్షన్ మంజూరు చేయాలని ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న వితంతువులు కోరుతున్నారు.

దాతల సాయంతో జీవనం గడుపుతున్నా

నా భర్త పాపారావు ఉన్నంత వరకూ రజక వృత్తితో జీవనం సాగించే దాన్ని. ఆయన మరణించాక బతుకు దుర్భరంగా మారింది. ఒంటరిని అయినందున వృత్తిని కొనసాగించలేకపోతున్నాను. గ్రామంలో దాతల సహాయంతో జీవనం గడపాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పింఛను ఇచ్చి ఆదుకోవాలి.

నారాయణపురం బంగారమ్మ, కన్నంపేట.

కూలికి వెళ్తేనే పూట గడుస్తుంది

నా భర్త సూర్యనారాయణ చనిపోయిన నాటి నుండి కూలీనాలీ చేసి బతుకు సాగుతుంది. పింఛను కోసం ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు విజ్ఞప్తులు ఇచ్చాం. రేపు, మాపు పెన్షన్ వస్తాదని ఎదురు చూస్తూనే ఉన్నాం. ఏడాది కావస్తున్నా పింఛను మంజూరు కాలేదు. ప్రభుత్వం పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

చింతల కాంతమ్మ, కన్నంపేట

గత ప్రభుత్వం చివర్లో దరఖాస్తు చేసుకున్నా

భర్త అప్పలనాయుడు చనిపోయి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ పెన్షన్ రాలేదు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆపేసింది. కూటమి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

ఎల్.సత్యవత్తమ్మ, కొండ బుచ్చంపేట



మోసూరులో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

చిరుద్యోగులపై వేధింపులా?

రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన

మంత్రి సంధ్యారాణి పై మాజీ డిప్యూటీ సిఎం ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

నియోజకవర్గంలో దళిత, గిరిజనులే లక్ష్యంగా టిడిపి నాయకులు దాడులు చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పాచిపెంట మండలం మోసూరులో కొత్తగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాజీ వైస్ ఎంపిపి గండిపిల్లి రాము అధ్యక్షతన నిర్వహించిన సభలో రాజన్నదొర మాట్లాడారు. నియోజకవర్గంలో గత ఏడాది కాలంగా మంత్రి సంధ్యారాణి రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. దళితులు, గిరిజనులే లక్ష్యంగా దాడులు చేయిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. అనేక మంది చిరుద్యోగులను తొలగించడం, దళిత అధికారులను బదిలీ పేరుతో వేధించడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. పాచిపెంట మండలంలో 8మంది, మెంటాడ మండలంలో 8మంది చిరుద్యోగులను సస్పెండ్ చేయించారని చెప్పారు. వీరిలో ఎక్కువగా దళితులు, గిరిజనులు,బిసిలే వున్నారని అన్నారు. వైసిపికి చెందిన గిరిజన సర్పంచులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలో సర్పంచ్‌లకు కల్పించిన హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మండలంలో రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసిపి దళిత నాయకుడు గండి పిల్లి రాము 24ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను ఇప్పుడు సర్వే చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అదే గ్రామంలో టిడిపి నాయకుడు చెరువును దర్జాగా కబ్జా చేస్తే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ వల్లే మంత్రి అయిన నియోజకవర్గ ఎమ్మెల్యే సంధ్యారాణి పాలనలో దళిత, గిరిజనులపై వేధింపులు పెరిగాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.చంటి, ఎంపిటిసి సభ్యులు కొల్లి లక్ష్మి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, పాచిపెంట చినబాబు, పిరిడి రామకృష్ణ, గిరిజన నాయకులు నెమలి పిట్ట కళ్యాణ్, పీడిక సుదర్శన్ రావు, నూకయ్య, సీతయ్య, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు

ఏనుగుల దాడి నుంచి తప్పించుకున్న వ్యక్తి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని సింగిడి గ్రామానికి చెందిన పింటూ శాంత్రో అనే వ్యక్తి సింగిడి పరిసరాలు సంచరిస్తున్న నాలు గు ఏనుగుల గుంపులు వద్ద తాగిన మైకంలో సోమవారం సాయంత్రం అరటిపండ్లను తీసుకెళ్లి తినాలనిపించుకున్నాడు. అయితే ఆ క్షణంలో ఒకసారి ఏనుగలి అతనిపై దాడి చేశాయి. కొద్దిపాటి స్పృహతో ఉన్న పింటూ శాంత్రో పొలాల గట్లలో దాక్కుని ఏనుగుల గుంపునకు దొరక్కుండా సుమారు గంటన్నర పాటు ఏనుగుల మధ్య ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది, బత్తిలి ఎస్ఐ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఏనుగుల గుంపును తరిమివేసి పింటూ శాంత్రోను రక్షించారు. ఏం జరిగిందోనని సింగిడి పరిసరాలల్లో చేరుకున్న జనాలు గుంపు పింటూ శాంత్రో సజీవంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి కావ్వింపు చర్యలకు పాల్పడి, ఎవరూ ప్రాణాల మీద తెచ్చుకొని ప్రాణాలను కోల్పోవద్దని పోలీసులు హెచ్చరించారు.



ఏనుగుల నుంచి పింటూ శాంత్రోను రక్షించిన అటవీ, పోలీసు అధికారులు

అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్ దామోదర రావు అన్నారు. అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కోర్టులో అంబేద్కర్ చిత్ర పటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణతంత్ర, ప్రజాస్వామిక దేశంగా మనదేశాన్ని తీర్చిదిద్దడంలో డాక్టర్ అంబేద్కర్ కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని చెప్పారు.

పార్వతీపురం రూరల్ : అణగారిన వర్గాలకు ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ రచన ద్వారా దేశ ప్రజలకు దిక్సూచి భారత్ రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి అన్నారు . బాబా సాహెబ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పి థామస్ రెడ్డి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఆదాం, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, ఆర్‌ఎస్‌ఐ లు, ఎస్‌ఐలు, ఎస్బీ, డిసిఆర్బి, ఎఆర్ అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌చంద్రదేవ్, ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కురుపాంలోని గాంధీ నగర్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, కూటమి నాయకులు మంతిని త్రిపురనాథ్, ఎస్.గోవింద, చంటి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంతో పాటు చలివేంద్రి, కత్తుల కవిటి, తూడి, నీలానగరం, తలవరం, తెట్టంగి, నడుకూరు, చిట్టపూడివలస, హుస్సేన్‌పురం, పివిఆర్ పురం, రేగులపాడు, ఎం.రాజపురం తదితర గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి. జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువత, పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలో పలుచోట్ల అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెలగవాడ వద్ద గల అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ ఆవిష్కరించారు. యాలం జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి డిఎస్పి ఎం.రాంబాబు, సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి పూలుమాలు వేసిన నివాళులర్పించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి దళిత సంఘాల ఉత్తరాంధ్ర ఉద్యోగుల సంఘం నేత మూతులపాటి భరతభూషణ్, పార్వతీపురం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బత్తిని మోహన్‌రావు, సర్పంచులు తిర్లంగి ఉపేంద్ర, రాయి రామకృష్ణ ఆనందరావు, శంకర్రావు, రవి, శాఖా గ్రంథాల అధికారి బి.గణేష్‌బాబు చిత్రపటానికి పూలుమాలు వేసిన వాళ్ళు అర్పించారు టిడిపి కార్యాలయంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు గుమ్మడి సింహాద్రి, నాయకులు చొంగ శివానంద్, సర్వేరావు, మజ్జి జయశంకర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక రెల్లివీధిలో అంబేద్కర్ విగ్రహానికి రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి బాబ్జీ, రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల కుమార్, బేవర ప్రసాద్, పిన్నింటి బాలరాజు పూలమాలు ఘనంగా నివాళులర్పించారు. నక్కల పేట ప్రాంతంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, కడగల రమణ, కాంతారావు, కె.విజయ్ కుమార్, దుంపల చిన్ని, మధు అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


పాలకొండ: అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పార్వతీపురం టౌన్ : మాజీ ఎమ్మెల్యే జోగారావు సారథ్యంలో నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నియోజకవర్గ వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన రహదారి 13వ వార్డు ఇందిరా కాలనీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మూడు మండలాలు, మున్సిపాల్టీల వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సాలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని 25వార్డు పరిధిలో బంగారమ్మ పేట, పిఎస్ బొడ్డు వలసల్లో అంబేద్కర్ విగ్రహాలకు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, వైసిపి నాయకులు టి.బలరాం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు, నాయకులు కస్తూరి రామకృష్ణ, పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.

పార్వతీపురం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్ నాథ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పైడి రాజు, ప్రధాన కార్యదర్శి తాడంగి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు తవిటన్న దొర, ప్రధాన కార్యదర్శి టి.సత్యనారాయణ, ఆదివాసీ కవి ఎమ్.జగదీష్, జిల్లా, మండల సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పెదభోగిలి సర్పంచ్ జె.తేరిజమ్మ, ఎంపిడిఒ పి త్రివిక్రమారావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు పూలుమాలల వేసి నివాళులర్పించారు. కాశీపేటలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ తేలు చంద్రశేఖరు, మాజీ జెడ్పిటిసి టి.వెంకటనాయుడు, టిడిపి నాయకులు తేలు తిరుపతిరావు పూలమాలు వేసి నివాళులర్పించారు. లచ్చిపేటలో సర్పంచ్ సిహెచ్ కృష్ణ, ఎంపిటిసి ఎ.సింహాచలం, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సీతంపేట : పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ సవర మంగయ్య, మాజీ ఎంపిపి సవర కుంపి, సవర కూర్మారావు, సవర సిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు, కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలక దేవానంద్, టిడిపి నాయకులు సొంటేన రాజేష్, కొనిస మన్మథరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్.శేఖర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, విఆర్‌ఒలు పాల్గొన్నారు.


కురుపాం: అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న మాజీ ఎమ్‌పి ప్రదీప్ చంద్రదేవ్

పుస్తకావిష్కరణ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ ఏం చేశారనే ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, కాంగ్రెసు కోఆర్డినేటర్ అడ్డంకుల చిన్నారావు, పాల్గొన్నారు.

పాచిపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి బి.ప్రమీల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, పి వీరమనాయుడు, వైస్ ఎంపిపి కొల్లి రవీంద్ర, ఎంపిటిసి దండి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో అంబేద్కర్ జయంతి

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ప్రాంగణంలో గల అంబేద్కర్ విగ్రహానికి ఎఒ సునీల్ ఇతర అధికారులు పూలమాలవేసి నివాళులర్పించారు. మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు పాలక నారాయడు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అకౌంట్ మేనేజర్ ఎఎంఒ పి కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని స్వామినాయుడువలస ఎస్‌సి వీధిలో అంబేద్కర్ విగ్రహానికి గ్రామస్తులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయ భవనాల్లో ఉద్యోగులు సమక్షంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

పార్వతీపురంరూరల్: దేశంలో అడుగడుగునా, అణువణునా రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందని ఈ తరుణంలో రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలంతా ఐక్యంగా పోరాటం చేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సభ సోమవారం పార్వతీపురం గిరిజన సామాజిక భవన్‌లో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణాజీ మాట్లాడుతూ సామాజిక హక్కుల రక్షణ, పౌర హక్కుల కోసం నినదించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, ఊర్లక నాగార్జున, కొండగొర్రి చిన్నారావు, గణేష్, టిఎస్ఎఫ్ నాయకులు పాలవలస భగవాన్, చెరువుల సంరక్షణ సమితి నాయకులు వంగలదాలి నాయుడు, సిపిఐ లిబరేషన్ నాయకులు పి.సంఘం, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవికుమార్, జెవివి నాయకులు చంద్రమౌళి, సామజిక చైతన్య వేదిక నాయకులు సంతోష్ కుమార్, ఆమ్ ఆద్మీ నాయకులు నయీమ్, తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురం రూరల్: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి దామోదరరావు



సీతంపేట: ఐటిడిఎ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న అధికారులు



పాచిపెంట : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి ప్రమీల

ఎట్టకేలకు ఎల్లంకి వీధికి మెట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఎల్లంకి వీధికి వెళ్లేందుకు ఎట్టకేలకు మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఎల్లంకి వీధి వైపు కాలువ ఎత్తుగా కట్టి వేయడంతో రాకపోకలు సాగించేందుకు ఈ వీధి వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధిలో ఎవరూ మృతి చెందిన అంతిమయాత్రకు తరలించేందుకు వీధి ఇరుగ్గా ఉండడంతో పాటు రహదారి మధ్యలో కాలువ నిర్మించడంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తుందని వీధి వాసులు ఆరోపించారు. పొరపాటున అడుగుతప్పిన కాలువలో పడిపోవాల్సిందే మేజర్ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనుల్లో భాగంగా వీధికి మెట్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు వృథాగా పోతుంది. సిఎస్ఆర్‌పేట- చిదిమి గ్రామాల మధ్య ప్రధాన పైపు లైను లీకు కావడంతో తాగునీరు అంతా వృథాగా పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అరకొర నీరు సరఫరా అవుతుంది.


వృథాగా పోతున్న తాగునీరు

కరుగుతున్న బెర్మ్‌లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఆడారు- డిపివలస గ్రామాల మధ్య మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఐటిడిఎ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మించిన బిటి రహదారికి ఇరువైపులా చేపట్టిన బెర్మలు కరిగిపోతున్నాయి. ఇటీవల రెండు దఫాలుగా కురిసిన భారీ వర్షాల కారణంగా బెర్మలు కరిగిపోవడంతో లక్షలాది రూపాయలతో వెచ్చించిన బిటి రహదారి పాడయ్యే ప్రమాదం ఉందని, స్థానికులు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి బీటీ రహదారి పాడవకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దెబ్బ తిన్న రోడ్డు బెర్మలు


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మనరావు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో గల ఆటో డ్రైవర్లతో సంత మార్కెట్ వద్ద ఎస్ఐ వై.అమ్మన్నరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. మద్యపానం సేవించి ఆటో డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. ఘాటీరోడ్‌లో వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఆటో డ్రైవింగ్ చేయాలని, ఘాటీ రోడ్లో డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్ఫ్ ఆపకుండా గేర్‌లో డ్రైవింగ్ చేయాలని అన్నారు. మద్యపానం సేవించి కానీ, ఓవర్ స్పీడ్‌గా డ్రైవింగ్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనం కూడా ఫిట్నెస్‌గా ఉండాలని చెప్పారు అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ ట్రైనీ ఎస్సైలు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నూతన అధ్యాయం

ప్రజాశక్తి- పాచిపెంట

నవధాన్యాల సాగు నేలతల్లి బాగు కోసమే అని భూ సారాన్ని పెంచే ఒక కొత్త శాస్త్రం ఈ నవధాన్యాల సాగు అని ప్రకృతి సేద్య రీజనల్ ట్రైనింగ్ అధికారి కె. ప్రకాష్ అన్నారు. వ్యవసాయాధికారి కె.తిరుపతిరావుతో కలిసి కొత్తవలస గ్రామంలో ఉన్న కొటికిపెంట రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల మిశ్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలను సాగు చేసి భూమిలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. మామూలు పచ్చిరొట్ట విత్తనాలతో పోలిస్తే నవధాన్యాల సాగు ఒక సరికొత్త శాస్త్రం అని తెలిపారు. ఆకు పచ్చని మొక్కలు అన్నీ కిరణాలు సన్యాసయ్యాక క్రియ అనే ప్రక్రియ ద్వారా స్వయం పోషకాలుగా తమ ఆహారాన్ని తామే తయారు చేసుకుంటాయని ఇలా తయారు చేసుకున్న శక్తిని వేరు వ్యవస్థలు భూమిలోనికి కొంత భాగాన్ని విడిచిపెడతాయని చెప్పారు. భూమిలో ఉన్న సూక్ష్మజీవులు ఈ శక్తిని గ్రహించి పంట తీసుకోలేని స్థితిలో ఉన్న మూలకాలను పంటల వేరు వ్యవస్థలు గ్రహించగలిగే స్థితిలోనికి మార్చి పంటకు అందించడం ద్వారా ఎలాంటి పోషక లోపాలు లేని పంటలు పండించవచ్చని భూమిలో జీవ వైవిధ్యం పెంచడం ద్వారా ఇది సాధ్యమని తెలిపారు. రకరకాల వేరు వ్యవస్థలు భూమిలో ఉండి అనేక రకాల సూక్ష్మజీవులకు ఆవాసంగా మారుతాయని తద్వారా భూమిలో జీవ వైవిధ్యం పెరిగి మృత్తిక మెరుగుపడి నీటిని పోషకాలను నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని కలుపు ఉధృతి తగ్గుముఖం పట్టి ఎండకు గాలికి వర్షానికి సారవంతమైన మట్టి నష్టపోకుండా చేసి భూమిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడమే ఈ పిఎండిఎస్ నవధాన్యాల సాగు ప్రాముఖ్యత అని తెలిపారు. రైతులందరూ ప్రస్తుతం పడుతున్న వర్షాలకు దుక్కి దున్ని నవధాన్యాలు వేసి మే నెలాఖరులోగా ఎలాంటి పంటలనైనా వేసుకోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మాపురం క్లస్టర్ ఇన్చార్జ్ కర్రీ శ్రీనివాసరావు, గురువినాయుడుపేట క్లస్టర్ ఇన్చార్జ్ సూర్యారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాచిపెంట లక్ష్మణ్, ఎల్‌టు సురేష్, రైతులు పాల్గొన్నారు.


నవధాన్యాల మిశ్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చెత్తబుట్టలు ఉండాలి

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు షాపింగ్ యజమానులు, వర్తకులు తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరామ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 65 లీటర్ల సామర్థ్యం ఏర్పాటు చేసుకొని చెత్తసేకరణకు వచ్చే సిబ్బందికి అందించాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదన్నారు. ఒకవేళ ఎవరైనా వేస్తే అపరాద రుసుం విధిస్తామన్నారు. నగర పంచాయతీలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈ నెలాఖరులోపు ఏ మొత్తంలో చెల్లిస్తే 50శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అలాగే 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకంగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు.

గడగమ్మలో తాగునీటికి ఇక్కట్లు

●నిరుపయోగంగా బోరు బావులు ●ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్న కుళాయి పాయింట్లు ●గుక్కెడు నీటి కోసం నాగావళి నదికి పరుగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

తరాలు మారినా మా గ్రామాన్ని మాత్రం తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. పాలకులు, అధికారులు వచ్చి వెళ్తున్నారు తప్ప కనీస చర్యలు చేపట్టకపోవడంతో సమస్య సమస్యగానే మిగిలిపోతుందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలోని గడగమ్మ గ్రామస్తులు. మండల కేంద్రమైన వీరఘట్టంకు కూత వేట దూరంలో ఉంది గడగమ్మ గ్రామం. ఈ గ్రామంలో 261 గృహాలు, సుమారు 1144 మంది జనాభా నివాసం ఉంటున్నారని అధికార గణాంకాలు చెబుతున్నాయి. గ్రామంలో పది బోరు బావులు ఉన్నాయి. అందుబాటులో ఏ విధమైన చెరువులు లేవు.

నాగావళి నది చెంతకు పరుగులు

గ్రామంలో బోరుబావులున్నప్పటికీ వాటి ద్వారా వచ్చే నీరు తాగేందుకు పనికి రావడం లేదని, గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న నాగావళి నది చెంతకు వెళ్లి చలమల ద్వారా నీడు తోడుకుని తీసుకువచ్చి దాహార్తిని తీర్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధులబారిన పడినప్పటికీ నది నీరు తెచ్చుకొని కాలం గడుపుతున్నట్లు గడగమ్మ గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి పక్కనే నది ఉన్నప్పటికీ తాగేందుకు నీరు రాకపోవడంతో తాగునీటి కోసం కష్టాలు తప్పడం లేదని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నాగావళి నదిలో చలమలు ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

నిరుపయోగంగా పడి ఉన్న బోరుబావుల

గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, పాఠశాలకు ఎదురుగా గత ఏడాది లక్షలాది రూపాయలతో జలజీవన్ మిషన్ పథకం కింద రెండు బోర్లు తవ్వారు. వీటి ద్వారా ఇంటింటికి తాగునీరిచ్చేందుకు కుళాయి పాయింట్లు కూడా ఏర్పాటు చేశారు. పనులు చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామంలో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. బోరు బావులతో పాటు ఇంటింటికీ కుళాయి పాయింట్లు కూడా ఏర్పాటు చేశారు. రోజులు గడుస్తున్నా వీటి ద్వారా చుక్క నీరు రాకపోవడంతో గ్రామంలో అవి ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నాయి. అప్పట్లో తవ్వకాలు జరపడంతో ఎట్టకేలకు గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని, సంబరపడ్డ గ్రామస్తులకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గడగమ్మ గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ డి.కావ్యశ్రీ వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా జలజీవన్ మిషన్ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల్లేక నిలిచిపోయాయని, అంతేకాకుండా గ్రామంలో ఉన్న బోరు బావుల నుంచి వచ్చే నీరు తాగేందుకు అనువుగా ఉంటుందని, వీటికి సంబంధించి నీటి పరీక్షలు కూడా చేశామని తెలిపారు.


నిరుపయోగంగా ఉన్న జలజీవన్ మిషన్ బోరు బావి

ఒకరికొకరు సహాయ పడాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి ఒకరికొకరు సహాయపడుతూ ఉండాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలోని గొటివాడలో జరుగుతున్న నిత్య జీవ ఆశీర్వాద పండగలకు ఎమ్మెల్యే సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి దూతగా ఉన్న యేసుక్రీస్తు మార్గంలో పయనిస్తూ సన్మార్గంలో నడవాలన్నారు. అలాగే మతం అనేది మనసుకు మాత్రమేనని మనిషికి కాదని, కావున ప్రజలంతా సోదర భావంతో కలిసిమెలిసి ఒకరికొకరు సహాయపడుతూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, కూటమి నాయకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.